తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
శనివారం
03 అక్టోబర్ 2026




మిగతా 11లో..

- డిజిటల్ అరెస్టులు, పిషింగ్ లింకులు, క్షణాల్లో దోపిడీ
- మొదటి 24 గంటలే కీలకం.. తక్షణమే 1930 కి కాల్
- సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే ఏకైక రక్షణ
- జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్

**జడ్చర్ల, సెప్టెంబర్ 30 (జనంసాక్షి):** సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు తీవ్రమవుతున్నాయి. రోజంతా స్మార్ట్ ఫోన్‌పై ఆధార పడే అమాయకులను ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు లక్షలాది రూపాయలు దోచేస్తున్నారు. బ్యాంక్ అధికారులమని, లక్కీ డ్రా వచ్చిందని, చౌకగా వస్తువులంటూ రకరకాల వలలు విసురుతున్నారు. డిజిటల్ అరెస్టులు, పార్సిల్ స్కామ్‌లతో ఆందోళన కలిగిస్తున్నారు.

### మహబూబ్ నగర్ కలెక్టరేట్‌లో
## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**మహబూబ్‌నగర్ అర్బన్ అక్టోబర్ 02 (జనంసాక్షి):** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ చూపిన అహింస, సత్యం, సహనం, శాంతి, మానవతా విలువలు మానవాళికి ఎంతో అవసరమని అన్నారు. గాంధీజీ ఆశయాలను, విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆచరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ ఎ. నిర్మల, ఎ.ఓ సువర్ణరాజ్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బెల్టు జోరు.. మద్యం మాఫియా హవా!



- గల్లీ గల్లీకో అక్రమ మద్యం విక్రయ కేంద్రం..
- గాంధీ జయంతి రోజునా మద్యం లభిస్తోందనే ఆరోపణలు
- వైన్‌షాపుల నుంచి గ్రామాలకు తరలింపు..
- పేద కుటుంబాలపై తీవ్ర ప్రభావం
- నారాయణఖేడ్లో బెల్ట్ షాపుల బరితెగింపు..



**నారాయణఖేడ్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** నారాయణఖేడ్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో బెల్టు షాపుల విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయని, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో అక్రమ మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసిస్తోందని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల ముసుగులో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**ప్రధాన సమస్యలు & అభ్యంతరాలు...**

గ్రామాలకు అక్రమ తరలింపు: పట్టణంలోని వైన్‌షాపుల నుంచి మద్యం బాటిళ్లను గ్రామాల్లోని బెల్టు షాపులకు తరలించి ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఉదయం నుంచే లభ్యమవుతుండటంతో యువత, కూలీలు మద్యానికి బానిసలవుతున్నారు.

**గాంధీ జయంతి (డ్రై డే) రోజునా అమ్మకాలు:** మద్యం విక్రయాలపై కఠిన ఆంక్షలు ఉండే మహాత్మా గాంధీ జయంతి వంటి 'డ్రై డే' రోజుల్లోనూ నారాయణఖేడ్ మరియు పరిసర గ్రామాల్లో అక్రమంగా మద్యం అందుబాటులో ఉండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మిగతా 9లో..

### జాషువా సాహిత్య స్ఫూర్తితో
## 'గుగ్గిలం' కవితా సంకలనం ఆవిష్కరణ

- సంగారెడ్డి జిల్లాకు చెందిన 26 మంది కవుల రచన

మిగతా 2లో..




**సంగారెడ్డి బ్యూరో అక్టోబర్ 2 (జనంసాక్షి):** మహాకవి గుర్రం జాషువా సాహిత్య స్ఫూర్తితో సంగారెడ్డి జిల్లాకు చెందిన 26 మంది ప్రముఖ కవులు రచించిన కవితలతో రూపొందించిన 'గుగ్గిలం' కవితా సంకలనాన్ని స్థానిక టీపీఎఫ్ భవనంలో ఘనంగా ఆవిష్కరించారు. సమాజంలో నెలకొన్న అరాచకాలు, కుల వివక్ష, ఆర్థిక అసమానతలను ప్రతిబింబించేలా ఈ పుస్తకాన్ని రూపొందించారు. దప్పొల్ల ప్రభలత, దప్పొల్ల రమేష్‌లు ఈ సంకలనానికి సంపాదకత్వం వహించారు.

**ముఖ్య అతిథుల ప్రసంగం...**

కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ కవి, విమర్శకులు, ఐఏఎస్ అధికారి డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ విద్యావేత్త డా. నలేశ్వరం శంకరం మాట్లాడుతూ.. జాషువా సాహిత్య విశిష్టతను కొనియాడారు.

## క్రీడలతో ఆరోగ్యకర సమాజం.. యువతకు కలెక్టర్ పిలుపు

- గాంధీ జయంతి సందర్భంగా జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

**వనపర్తి అక్టోబర్ 2 (జనంసాక్షి):** క్రీడలు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వనపర్తి పట్టణంలోని అభి స్పోర్ట్స్ అరేనాలో ఫిట్ ఇండియా మూవ్‌మెంట్‌లో భాగంగా జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2026ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముందుగ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ అనంతరం బ్యాడ్మింటన్ ఆడి పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల ద్వారా క్రీడాస్ఫూర్తి, జట్టుస్ఫూర్తి, క్రమశిక్షణ వంటి విలువలు అలవడతాయని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీల్లో సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడాస్ఫూర్తితో పోటీపడి ప్రతిభను చాటుకోవాలని క్రీడాకారులకు సూచించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి సహకరిస్తున్న అభి స్పోర్ట్స్ అరేనా నిర్వాహకులు డాక్టర్ మురళీధర్‌ను అభినందించారు.

అక్టోబర్ 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే ఈ ఛాంపియన్‌షిప్‌లో అండర్--15 బాలుర సింగిల్స్, ఓపెన్ పురుషుల సింగిల్స్, ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ప్రభుత్వ మినీ స్టేడియం, అభి స్పోర్ట్స్ అరేనా వేదికలుగా పోటీలు జరుగుతున్నాయి.








కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, అభి స్పోర్ట్స్ అరేనా నిర్వాహకులు డాక్టర్ మురళీధర్, క్రీడాకారులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సంజీవ రెడ్డి వరి కొనుగోలు కేంద్రం మంజూరుకు కలెక్టర్‌కు వినతి



**సిర్గాపూర్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలంలోని బోకా స్నాన్ పిఏసిఎస్ పరిధిలో వరి కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ కు లేఖ రాశారు. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

## హద్నూర్ సీఐ జక్కుల హణమంతు బదిలీ

**న్యాల్‌కల్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** జహీరాబాద్ గ్రామీణ వలయాధికారి (హద్నూర్, రాయికోడ్, ఝరాసంఘం) సర్కిల్ ఇన్స్పెక్టర్ (సిఐ) జక్కుల హనుమంతు బదిలీ అయ్యారు. జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు గురువారం సాయంత్రం సిఐని హైదరాబాద్ (వేయిటింగ్)కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు సంవత్సరాలకు పైగా జహీరాబాద్ రూరల్ సీఐగా విధులు నిర్వహించారు.

## రెడ్‌క్రాస్ నూతన కార్యవర్గానికి నిరంజన్‌రెడ్డి అభినందనలు



**వనపర్తి రూరల్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** వనపర్తి జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సన్మానించి అభినందించారు. 'మానవ సేవయే మాధవ సేవ, రక్తదానం మహాదానం' అనే స్ఫూర్తితో నిరుపేదలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. సన్మానం పొందిన వారిలో చైర్మన్ అమరేందర్, వైస్ చైర్మన్ డాక్టర్ ప్రియాంక, కోశాధికారి విష్ణువర్ధన్, సభ్యులు అమరేందర్, కృష్ణ ఉన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్, రమేష్ గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**మహమ్మదాబాద్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలం జూలపల్లిలో ఉపాధి హామీ పని ప్రదేశాలను సర్పంచ్ పద్మ నర్సింహులు సందర్శించి, కూలీలకు ఓఆర్ఎస్ (ORS) ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు నీరసం, డీహైడ్రేషన్, వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సరిపడా తాగునీరు తాగాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిష్టయ్య, వార్డు మెంబర్ నరేష్, ఆశా వర్కర్ సుజాత, కూలీలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ మండల కమిటీకి పేర్ల స్వీకరణ



**కృష్ణ, అక్టోబర్ 2 (జనంసాక్షి):** కాంగ్రెస్ అధిష్టానం, మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కృష్ణ మండల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు మండల కేంద్రంలో ఆశావహుల పేర్లను స్వీకరించారు. మండల అధ్యక్షుడు మాలిపాటిల్ విజప్ప గౌడ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర హోం మంత్రి అమిత్ షా పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

- **అధికారులతో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్** (ASL)
- **సమావేశం నిర్వహించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**




**తూప్రాన్, అక్టోబర్, 2 (జనంసాక్షి):** కేంద్ర హోం మంత్రి అమిత్ షా అక్టోబర్ 4న మెదక్ జిల్లా బ్రహ్మణపల్లిలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నట్లు మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ తెలిపారు. పర్యటన బందోబస్తుపై శుక్రవారం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ASL) సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశానికి ముందు ఎస్పీ అధికారులతో కలిసి బ్రహ్మణపల్లిలో కేంద్ర హోం మంత్రి చేతుల మీదుగా జరగనున్న అమూల్ మిల్క్ కంపెనీ భూమి పూజ స్థలం, హెలిప్యాడ్, సభా వేదికల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం భద్రతా ప్రణాళిక, రూట్ మ్యాప్, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.
**ఈ సందర్భంగా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ..** కేంద్ర హోం మంత్రి పర్యటన నేపథ్యంలో భద్రతలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వీఐపీ రాకపోకలు సాగించే మార్గాలు, ప్రజల రాకపోకల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సాధారణ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు ట్రాఫిక్ ప్రణాళికను రూపొందించి, అవసరమైన ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని సూచించారు.
రెవెన్యూ, వైద్య ఆరోగ్య, ఫుడ్ సేఫ్టీ, ఆర్అండ్‌బీ, ఐఎస్‌డబ్ల్యు (ISW), సీఆర్‌పీఎఫ్ (CRPF) తదితర శాఖల అధికారులు పోలీస్ శాఖతో నిరంతరం సమన్వయం పాటిస్తూ తమ పరిధిలోని ఏర్పాట్లను సమయానికి



పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పరస్పర సమాచార మార్పిడితో పర్యటనను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులతో పాటు వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాంధీ జయంతి వేడుకల్లో శ్రమదానం

**కొండపాక, అక్టోబర్ 2 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిరిసినగండ్లతో పాటు పరిసర గ్రామాల్లో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటేశ్వర్లు, సర్పంచ్ ముత్యాల ఎల్లంయాదవ్వ పిచ్చిమొక్కలను తొలగించి శ్రమదానం చేశారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య వంతమైన జీవనం సాధ్యమని, నేటి గ్రామాల అభివృద్ధియే దేశ భవిష్యత్తుకు పునాది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెంది కరుణాకర్, కార్యదర్శి స్వాతి, వార్డు సభ్యులు, నాయ కులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతోనే నేరాల నియంత్రణ: ఎస్సై సుజిత్



**న్యాల్‌కల్, అక్టోబర్ 02, (జనంసాక్షి):** ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని హద్నూర్ ఎస్సై సుజిత్ తెలిపారు. ఇటీవల విద్యుత్ తీగల చోరీలకు పాల్పడుతున్న దుండగులను సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా పట్టుకున్నామని చెప్పారు. న్యాల్‌కల్ మండలం కర్ణాటక-తెలంగాణ సరిహద్దులో ఉండటం వల్ల అసాంఘిక శక్తులను పట్టుకోవడం సవాలుగా మారిందన్నారు.
గ్రామాల ప్రధాన ముఖ ద్వారాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే చోరీలు, దొంగతనాలు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చని ఎస్సై సూచించారు. ఈ మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు సర్పంచులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు.

## నీటి సంరక్షణపై ప్రజలకు అవగాహన




**కొల్చారం, అక్టోబర్ 02 (జనంసాక్షి):** కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లిలో సర్పంచ్ లతా శ్రీశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌డీవీ పీడీ శ్రీనివాసరావు పాల్గొని వీబీజీ పథకం ద్వారా నిర్వహించే నీటి కుంటలు, ఇంకుడు గుంతలు, ఊట కుంటల నిర్మాణ ప్రాధాన్యతను వివరించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీక్ ఉన్నిసా, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న గట్లమల్యాల గ్రామస్తులు

**అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి ఈశ్వరికి రూ.2 లక్షల ఆర్థికసాయం**



**నంగునూరు, అక్టోబర్ 2 (జనంసాక్షి):** అంతర్జాతీయ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించబోతున్న విద్యార్థినికి గట్లమల్యాల గ్రామస్తులు అండగా నిలిచి మానవత్వం చాటుకున్నారు. నంగునూరు మండలం గట్లమల్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న భానోతు ఈశ్వరి భారత అండర్-15 బాలికల సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైంది. చైనా వేదికగా అక్టోబర్ 12 నుంచి 18 వరకు జరగనున్న అంతర్జాతీయ అండర్-15 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఆమె భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించనుంది. ఈశ్వరి స్వగ్రామం అక్కన్నపేట మండలం కాపూర్ నాయక్ తండా. ఆర్థిక ఇబ్బందులతో చైనాకు వెళ్లడం ఆమె కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. రమేష్ గట్లమల్యాల గ్రామస్తుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రూ.50 వేలు, గ్రామస్తులు రూ.1.50 లక్షలు సమకూర్చారు. మొత్తం రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని శుక్రవారం గ్రామ పెద్దల సమక్షంలో సర్పంచ్ ఇంగె నరేష్ చేతుల మీదుగా ఈశ్వరికి అందజేశారు. అనంతరం ఈశ్వరికి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఆమెకు శిక్షణ ఇచ్చిన పీఈటీ రాజ్‌కుమార్‌ను కూడా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎడ్ల సోమిరెడ్డి, వీరనాయక్, రమేష్, శ్రీనివాస్, సత్తి, వెంకటేష్, సంపత్, చింటు, బన్నీ, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో బాల్యవివాహాలపై అవగాహన సభ



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మహిళా, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం (DCPU) ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శ్రీరంగాపూర్ మండలం వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ ఎస్. సావిత్రి అధ్యక్షతన 'బాల్య వివాహం బతుకు ఆగం' అంశంపై ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. 'బాల్యవివాహ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.
**సమావేశంలో ఐజాఖ సోషల్ వర్కర్ నరేందర్ మాట్లాడుతూ..** 2006 బాల్యవివాహాల నిషేధ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు, 21 ఏళ్ల లోపు అబ్బాయిలకు పెళ్లిళ్లు చేయడం నేరమని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని తల్లిదండ్రులకు సూచించారు.
**సమావేశంలో అవగాహన కల్పించిన ప్రధాన అంశాలు:**
1.పోక్సో (POCSO) చట్టం-2012, బాలల అక్రమ రవాణా నిరోధకం, గుడ్ టచ్ - బ్యాడ్ టచ్.
2.స్కూల్ డ్రాపౌట్ల నివారణ, అనాథ పిల్లలకు ఇచ్చే స్పాన్సర్‌షిప్ ఆర్థిక సాయం.
3.చైల్డ్ హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్లు 1098, 112 వినియోగంఅనంతరం వెంకటాపురాన్ని బాల్యవివాహ రహిత గ్రామంగా మార్చేందుకు తీర్మానం చేసి, హాజరైన వారందరితో సామూహిక ప్రతిజ్ఞ చేయించారు.
ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఎంఈఓ హనుమంతు, పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులు గ్రామ పాలనాధికారులు

- జీపీవోల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్తా: నిర్మలా జగ్గారెడ్డి





**సంగారెడ్డి, అక్టోబర్ 2 (జనంసాక్షి):**
ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య గ్రామ పాలనాధికారులు (జీపీవోలు) కీలక అనుసంధానకర్తలని డీసీసీ మాజీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలో గ్రామ పాలనాధికారుల సంఘం తెలంగాణ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రథమ మహాసభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో గ్రామ స్థాయిలో కీలకమైన సేవలకు ఆటంకం కలిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరిగి గ్రామ పాలనాధికారులను నియమించి వారి సేవలను వినియోగించుకుంటోందని తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామ పాలనాధికారులను మరింత ప్రోత్సహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.
మహాసభలో జీపీవోల సంఘం ప్రతినిధులు తమ సమస్యలు, డిమాండ్లను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వాటిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నిర్మలా జగ్గారెడ్డి హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంలో జీపీవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మల్లారం అర్జున్, విజయ్, రాష్ట్ర కార్యదర్శి దాసరి వీరన్న, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు ఎం. చిరంజీవి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పృథ్వీరాజ్, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కూన సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## సత్యం.. అహింసే ఆదర్శం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

**రామచంద్రాపురం, అక్టోబర్ 2 (జనంసాక్షి):**
మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, ధర్మం, సహనం మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా రామచంద్రాపురం డివిజన్‌లోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీజీ విగ్రహాన్ని శాసనమండలి మాజీ ప్రొటెం చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం గాంధీ బాలవిహార్ పార్కులోని గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంజయ్య, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు అండగా లయన్స్ క్లబ్

**దుస్తులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**





**నారాయణఖేడ్, అక్టోబర్ 02 (జనంసాక్షి):**
నారాయణఖేడ్ ZPHS పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి కార్మికులకు దుస్తులను అందజేశారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం కోసం కార్మికులు ఎండావానలను లెక్కచేయకుండా అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. వారి శ్రమను సమాజం గౌరవించాలన్నారు. కార్మికులకు దుస్తులు అందించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీజీకి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నివాళి



**సంగారెడ్డి, అక్టోబర్ 2 (జనంసాక్షి):**
మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ దేశానికి చేసిన సేవలను, అహింసా మార్గంలో స్వాతంత్ర్య ఉద్యమానికి అందించిన కృషిని స్మరించుకున్నారు. సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం వంటి గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీహరి, మండల పార్టీ అధ్యక్షుడు విఠల్, మాజీ జడ్పిటిసి పాండు, కౌన్సిలర్ దశరథ్ రెడ్డి పాల్గొన్నారు.

## మొగుడంపల్లి బీజేపీ మండల అధ్యక్షుడిగా నీలావలం జగన్ నియామకం

- నియామక పత్రం అందజేసిన గోదావరి అంజిరెడ్డి



**మొగుడంపల్లి, అక్టోబర్ 02 (జనంసాక్షి):**
సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండల నూతన బీజేపీ అధ్యక్షుడిగా నీలావలం జగన్ నియమితులయ్యారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు గోదావరి అంజిరెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నౌబాద్ జగన్నాథ్, ఉపాధ్యక్షుడు గొల్ల భాస్కర్, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పార్టీని సమన్వయంతో బలోపేతం చేస్తూ ముందుకు తీసుకెళ్లాలని నాయకులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## దీటి రాజును సన్మానించిన రసమయి బాలకిషన్



**బెజ్జంకి, అక్టోబర్ 2 (జనంసాక్షి):**
రజక సంఘం సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన దాచారం గ్రామానికి చెందిన దీటి రాజును మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ శుక్రవారం ఘనంగా సన్మానించారు. రజక సంఘం అభివృద్ధి, సంక్షేమం కోసం రాజు కృషి చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, చింతకింది శ్రీనివాస్ గుప్తా, ముక్కిస రాజిరెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

## చెరువు మెట్ల నిర్మాణానికి భూమిపూజ



**చేర్యాల, అక్టోబర్ 02(జనంసాక్షి):**మండలంలోని ఆకునూరు గ్రామ ఎల్లమ్మ చెరువు కట్టకు మహిళలు బతుకమ్మ వేయడం కోసం ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా మెట్ల నిర్మాణానికి గురువారం స్థానిక ఎంపీఓ సుధీర్, సర్పంచ్ కొమ్ము రవి, పాలకవర్గంతో కలిసి భూమి పూజ నిర్వహించారు.

## గురుజువాడ గ్రామసభలో అభివృద్ధికి బిగ్ ప్లాన్

- నీటి సంరక్షణే లక్ష్యం.. రైతు సంక్షేమమే ధ్యేయం!
- 15 కీలక పనులకు ప్రతిపాదనలు.. గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళిక



**కోహిర్ అక్టోబరు 2, (జనంసాక్షి):**
సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం గురుజువాడ గ్రామాభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్ ప్రియాంక రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో 15 కీలక పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. భూగర్భ జలాల పెంపునకు ఇంటింటికీ ఇంకుడు గుంతలు, ఓహెచ్ఆర్ ట్యాంకులు, పాఠశాలల్లో సోక్ పిట్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు.
రైతుల సంక్షేమం కోసం ఫారం పాండ్లు, పండ్ల తోటలు, కంపోస్ట్ షెడ్లు, పొలాలకు మట్టి రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. వరద నివారణకు మళ్లింపు కాలువలు, చెక్‌డ్యామ్‌లు, మ్యాజిక్ డ్రెయిన్లు, పూడిక తీత పనులు ప్రతిపాదించారు. విస్తృతంగా మొక్కలు నాటుతూ పచ్చదనం పెంచడమే ధ్యేయంగా నిర్ణయాలు తీసుకున్నారు.
ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ పేర్కొనగా, ఈ సభలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఉప సర్పంచ్ సాయికుమార్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రియల్ హీరో స్మిత్ మాచర్ త్వరగా కోలుకోవాలి



**చేర్యాల, అక్టోబర్ 02 (జనంసాక్షి):** కో-పైలట్ దాడిలో 174 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడి దేశానికి గర్వకారణంగా నిలిచిన పైలట్ స్మిత్ మాచర్ త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముస్త్యాల కిష్టయ్య, సర్పంచ్ కొమ్ము రవి ఆకాంక్షించారు. చేర్యాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, స్మిత్ మాచర్ ప్రపంచానికే రియల్ హీరో అని కొనియాడారు. ఆయనకు కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆశీస్సులు కలగాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు అందె నానిబాబు, గూడెపు మహేష్, భాను గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఘన సత్కారం

- సర్పంచ్ బొల్లం శ్రీధర్



**బెజ్జంకి,అక్టోబర్ 2,(జనంసాక్షి):**
బెజ్జంకి గ్రామపంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని సర్పంచ్ బొల్లం శ్రీధర్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అత్యంత కీలకమని కొనియాడారు. వారి శ్రమను గుర్తించి సన్మానించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుమాల మహేష్, పంచాయతీ కార్యదర్శి ప్రణీత్ రెడ్డి, వార్డు సభ్యులు, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సర్వీసింగ్ కోసం వెళ్లి ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



**పాపన్నపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి) :** ద్విచక్ర వాహనం సర్వీసింగ్ కోసం వెళ్లి వస్తున్న ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన పాపన్నపేట వద్ద జరిగింది. టేక్మాల్ మండలం కాదులూరు గ్రామానికి చెందిన మొల్ల దస్తగిరి (23), మారిగారి బాబు (23) కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు.
గురువారం రాత్రి మెదక్ నుంచి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, పాపన్నపేట శివారులోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన జేసీబీ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి తండ్రి గూడూసాబ్ ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ తుక్కయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో కాదులూరులో విషాద ఛాయలు అలముకున్నాయి.

# రాజనగరాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

- అభివృద్ధి పనులకు ప్రాధాన్యత..
- రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి):** రాజనగర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

గాంధీ జయంతి సందర్భంగా రాజనగరంలో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. అనంతరం ప్రధాన రహదారి ఆర్చి నిర్మాణానికి, సీసీ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు, నిర్మాణం పూర్తయిన పల్లె దవాఖానాను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని గృహ ప్రవేశం చేసిన లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి శాలువాలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిలు, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తానని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ నక్క రాణి రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, యూత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రత కోసం పోస్ట్‌కార్డు ఉద్యమం



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 02 (జనంసాక్షి):** జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేటలో 'టియూడబ్ల్యూజే-హెచ్143' ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమం ప్రారంభమైంది. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గాంధీ చౌరస్తాలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన జర్నలిస్టులు, అనంతరం తమ ప్రధాన కోరికలను పోస్ట్‌కార్డులపై రాసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంపించారు.

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కన్వీనర్ గందె నాగరాజు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చే జర్నలిస్టులు విధి నిర్వహణలో తీవ్ర ఒత్తిళ్లు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు లేకుండా కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందేలా గతంలో అమలైన 'ఈజేహెచ్ఎస్' (EJHS) పథకాన్ని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా చేపడుతున్న ఆందోళనల్లో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే సానుకూలంగా స్పందించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు నిమ్మ అశోక్, మైపాల్ రెడ్డి, కట్ట నవీన్, పోతుల మల్లి, పల్లెటూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జీవో నం.25ను పునఃపరిశీలించాలి: ఎస్జీటీయూ డిమాండ్



**తూప్రాన్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటుకు సంబంధించిన జీవో నంబర్ 25ను పునఃపరిశీలించి, అవసరమైతే రద్దు చేయాలని లేదా సవరణలు చేయాలని ఎస్జీటీయూ (SGTU) మెదక్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం తూప్రాన్‌లో గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మెదక్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (DCC) అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

**ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..** ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య ఆధారంగానే ఉపాధ్యాయుల కేటాయింపు జరుగుతుండటం వల్ల, ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు బహుళ తరగతులకు బోధించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రతి తరగతికి తగిన బోధనా సమయాన్ని కేటాయించడం, విద్యార్థుల అభ్యసన ఫలితాలపై శ్రద్ధ చూపడం కష్టతరమవుతోందని తెలిపారు.

ఉపాధ్యాయుల కేటాయింపులో కేవలం విద్యార్థుల సంఖ్యనే కాకుండా తరగతుల సంఖ్య, బోధనా భారం, భౌగోళిక పరిస్థితులను కూడా ప్రాతిపదికగా తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై అధ్యయనం చేసి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, జిల్లా అధ్యక్షుడు జింక అశోక్ మరియు సంఘ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# గ్రామ సభల ద్వారానే ప్రజల అవసరాలకు తగ్గ అభివృద్ధి: అదనపు కలెక్టర్

**అడ్డాకుల అక్టోబర్ 2(జనంసాక్షి):** గాంధీ జయంతి సందర్భంగా అడ్డాకల్, మూసాపేట మండలం జనంపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) మధుసూదన్ నాయక్ హాజరయ్యారు. స్థానిక సమస్యలు, పారిశుద్ధ్యం, తాగునీరు, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రజలతో చర్చించారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రజల భాగస్వామ్యంతో గుర్తించేందుకు గ్రామ సభలు కీలకమని పేర్కొన్నారు. విబిజి-రామ్‌జి (VBG-RAM-G) పథకం కింద గ్రామానికి కావాల్సిన అభివృద్ధి పనులను ప్రజల ప్రాధాన్యతల ఆధారంగా ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. గ్రామాల సమగ్ర వికాసానికి అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ, వైద్యాధికారి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఈసీలు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ అందరికీ ఆదర్శప్రాయుడు: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య కోసం మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి తమవంతు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో ఏవోయూనాస్ మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి మహాత్మా గాంధీ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ ఏ ఓ, సిబ్బంది ,తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలి: ఎంపీ డీకే అరుణ



**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 2(జనంసాక్షి):** రానున్న హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని శ్రీ గార్డెన్‌లో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

**ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి...**

ఎన్రోల్‌మెంట్ ప్రక్రియకు సమయం తక్కువగా ఉన్నందున, ప్రతి కార్యకర్త భాగస్వామ్యమై అత్యధికంగా పట్టభద్రుల ఓట్లను నమోదు చేయించాలని ఎంపీ పిలుపునిచ్చారు. గతంలో ఈ స్థానంలో బీజేపీ గెలిచిన చరిత్ర ఉందని, పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న పట్టును మళ్లీ నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.

**ప్రభుత్వాలపై విమర్శలు...**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, నిరుద్యోగుల హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనతో విసుగు చెందిన ప్రజలు రాష్ట్రంలో బీజేపీ రాకను కోరుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రతంగ్ పాండు రెడ్డి, పగడాకుల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్‌పర్సన్ మంజుల, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్లు ఊడ్చిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



**సిద్దిపేట బ్యూరో, అక్టోబర్ 02 (జనంసాక్షి):** గాంధీ జయంతి, 'స్వచ్ఛత హీ సేవ' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణ పరిశుభ్రతపై భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సేకరించిన చెత్తను మున్సిపల్ వాహనాల ద్వారా తరలిస్తూ భారీ ర్యాలీ చేపట్టిన అనంతరం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ స్వయంగా చీపురు పట్టుకుని రోడ్లను ఊడ్చి ప్రజల్లో చైతన్యం నింపారు.

**స్వచ్ఛ సిద్దిపేటకు ప్రజలు సహకరించాలి...**

**ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ..** పట్టణ పరిశుభ్రత కేవలం మున్సిపాలిటీ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు భాగస్వామి అయినప్పుడే 'స్వచ్ఛ సిద్దిపేట' నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రమై ప్రజారోగ్యం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు తమ ఇళ్లలోనే చెత్తను తడి, పొడి, హానికర చెత్తగా వేరు చేసి, ఇంటింటికీ వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు.

**మొక్కలు నాటి స్వచ్ఛ ప్రతిజ్ఞ...**

కార్యక్రమంలో భాగంగా వీర సావర్కర్ చౌరస్తా ఆవరణలో కమిషనర్ మొక్కలు నాటి నీరు పోశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మానవహారం నిర్వహించి స్వచ్ఛ సిద్దిపేట ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గాంధీజీ మార్గం.. సమాజానికి మార్గదర్శకం: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, అక్టోబర్ 2 (జనంసాక్షి):** గాంధీజీ చూపిన మార్గం సమాజానికి మార్గదర్శకమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు వర్షాభావ పరిస్థితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉదండాపూర్ కెనాళ్లు పూర్తయితే వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుందని, జడ్చర్లకు ఆర్‌అండ్‌బీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. స్మశానవాటికల కోసం హిందూ, ముస్లిం, క్రైస్తవ వర్గాలకు స్థలాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు వెల్లడించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా బోర్లు వేయాలని ఆదేశించారు.

అనంతరం కొత్త కేశవులు 122వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కావేరమ్మపేట వార్డు కార్యాలయం, గాంధీ చౌక్ వద్ద జరిగిన వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ గిరీష్, బీసీ జాగృతి సేన అధ్యక్షుడు కృష్ణ యాదవ్ మరియు అధికారులు పాల్గొన్నారు.

# డ్రై డే నిబంధనలు గాలికి: పేటలో యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- గాంధీ జయంతి రోజునా ఆగని అక్రమ దందా..
- వెనుక ద్వారాలు, బెల్టు దుకాణాలే అడ్డాగా ఆరోపణలు

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా మద్యం విక్రయాలపై నిషేధం (డ్రై డే) అమల్లో ఉన్నప్పటికీ, పెద్దశంకరంపేటలో మాత్రం వ్యాపారులు నిబంధనలను బేఖాతరు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారికంగా మద్యం దుకాణాల ముందు తలుపులు మూసివేసినప్పటికీ, వెనుక ద్వారాలు మరియు గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టు దుకాణాల ద్వారా యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



**అధిక ధరలకు విక్రయాలు.. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు**

'డ్రై డే' రోజున మద్యం లభించకూడదనే నిబంధన ఉన్నా, పట్టణంలో కోరిన బ్రాండ్ల మద్యం అందుబాటులో ఉంచుతూ సాధారణ ధరల కంటే అధిక మొత్తానికి విక్రయిస్తున్నట్లు చెబుతున్నారు. నిబంధనలు కఠినంగా అమలు కావలసిన రోజున కూడా ఇలా అక్రమ వ్యాపారం సాగుతుంటే,ఎక్సైజ్ పోలీసు శాఖల పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు తలెత్తుతున్నాయి. తనిఖీలు క్షేత్రస్థాయిలో సరిగ్గా నిర్వహించకపోవడం వల్లే ఇలాంటి చర్యలకు అడ్డుకట్ట పడటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

మద్యం అక్రమ విక్రయాలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విస్తృత తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయిస్తున్న వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే పర్యవేక్షణలో విఫలమైన అధికారుల తీరుపై విచారణ జరిపించి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

### ఎంపీడీవో కాంపౌండ్ వాల్

## నిర్మాణంలో నాణ్యతా లోపం: సీపీఎం

**ఆత్మకూర్, అక్టోబర్ 2(జనంసాక్షి):** ఆత్మకూర్ ఎంపీడీవో కార్యాలయ కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.రాజు ఆరోపించారు. శుక్రవారం నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, బలమైన మెటీరియల్‌కు బదులు తక్కువ నాణ్యత కలిగిన సిమెంట్ ఇటుకలను వినియోగిస్తున్నారని తెలిపారు. దీనివల్ల గోడ త్వరగా పాడై ప్రజాధనం దుర్వినియోగమయ్యే ప్రమాదం ఉందన్నారు. అధికారులు



వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టి, నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఘనంగా ఇర్ఫానీ దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు



- వైభవంగా గంధం ఊరేగింపు
- అఖిలభారత కవి సమ్మేళనం

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి):** సంగారెడ్డిలోని ఇర్ఫానీ దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు ఉమర్ బిన్ ఆహ్మద్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పాత జైలు సమీపంలోని జామియా మసీదు నుంచి గంధం ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా సాగిన ఊరేగింపు పట్టణ శివారులోని ఇర్ఫానీ దర్గా వరకు కొనసాగింది.

అనంతరం నిర్వహించిన అఖిలభారత కవి సమ్మేళనంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు పాల్గొని తమ కవితలతో అలరించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఇర్ఫాన్ సేవా పురస్కారాలను జహీరాబాద్ మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్,





సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ అహ్మద్‌లకు అందజేశారు. ఉర్సు ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

## అభివృద్ధి పనుల మంజూరుపై సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకం



**కొత్తపల్లి, అక్టోబర్ 2 (జనంసాక్షి):** కొత్తపల్లి మండలం నందిగామ గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.20.50 కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.30 లక్షలు, అంగన్‌వాడీ, వీవో భవనాలకు నిధులు మంజూరు కావడంపై సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్థులు పాలాభిషేకం చేశారు. సర్పంచ్ శారదాబాయి హనుమంతు నాయక్, ఉపసర్పంచ్ సరోజ శ్రీనివాస్ రెడ్డి నాయకులు పాల్గొని ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### రామచంద్రాపురం

## పోలీస్ స్టేషన్ పరిధుల్లో మార్పులు

**రామచంద్రాపురం, అక్టోబర్ 2(జనంసాక్షి):** పోలీస్ స్టేషన్ల ప్రాదేశిక పరిధుల పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలు ప్రాంతాల పరిధులను మారుస్తూ జీఓ 85, 88ల ప్రకారం చర్యలు తీసుకున్నట్లు రామచంద్రాపురం సిఐ లాలూనాయక్ తెలిపారు. ఈ మార్పులు అక్టోబర్ 2, 2026 నుండి అమల్లోకి వచ్చాయి.

కొల్లూరు సీఐ పరిధిలోని బీహెచ్‌ఈఎల్ న్యూ ఎంఐజీ (విద్యుత్‌నగర్) కాలనీ రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేరింది. అదేవిధంగా రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ గ్రామం, మార్క్సనగర్, భూపాల్‌రెడ్డి కాలనీ, నేతాజీనగర్, బాలాజీనగర్‌లు పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలోకి మారాయి. శాంతిభద్రతలు, ఫిర్యాదుల స్వీకరణ, దర్యాప్తు సేవల కోసం ప్రజలు కేటాయించిన కొత్త పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని సూచించారు.

## శ్రీ బంగారు మైసమ్మకు విశేష పూజలు

**జడ్చర్ల, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట ఐబీ బంగ్లా సమీపంలో, 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు నిర్వహించి, అలంకరించారు. పూజా కార్యక్రమంలో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త గోనెల నరేందర్ మహేశ్వరి దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక భక్తులు, మహిళలు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



### రాజాపూర్‌లో

## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**రాజాపూర్, అక్టోబర్ 2(జనంసాక్షి):** రాజాపూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో గాంధీ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. తిరుమలాపూర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంతోష వెంకటేష్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం, అహింస, స్వచ్ఛతలతో గాంధీజీ ఆశయ సాధనకు కట్టుబడి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామని, ఆయన చూపిన శాంతి మార్గంలో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

### కార్మికుల ఈపీఎఫ్

## సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వినతి



**జడ్చర్ల, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల 2012-2014 ఈపీఎఫ్ సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. అధికారుల నిర్లక్ష్యంతో రూ.1 కోటి జరిమానా పడటంతో పాటు 53 మంది మృతుల కుటుంబాలకు ఈపీఎఫ్, పెన్షన్ అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

## ఎంబీబీఎస్ సీటు సాధించిన విద్యార్థినికి ఆర్థిక చేయూత



**మహమ్మదాబాద్,అక్టోబర్ 02 (జనంసాక్షి):** మహమ్మదాబాద్‌కు చెందిన చిట్టేల గాయత్రి పటాన్‌చెరు రాజరాజేశ్వరి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించగా, స్థానికులు వాట్సాప్ గ్రూప్ ద్వారా స్పందించి రూ.30,000 ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం మహమ్మదాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో గాయత్రిని ఘనంగా సన్మానించి సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈరాములు మాట్లాడుతూ.. గాయత్రి వైద్య విద్యలో రాణించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎం నారాయణ, ఎంఈఓ జనార్ధన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 9న బీఎస్పీ బహిరంగ సభను విజయవంతం చేయండి



**శ్రీరంగాపూర్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** బహుజన్ సమాజ్ పార్టీ (BSP) వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్సీరామ్ వర్ధంతి సందర్భంగా అక్టోబర్ 9న నిర్వహించే భారీ బహిరంగ సభ గోడపత్రికను శ్రీరంగాపూర్ సెక్టార్ అధ్యక్షుడు జమ్మన్నగారి రాము విడుదల చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పిలుపు మేరకు చేపడుతున్న ఈ సభను బహుజనులంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడెం ఎల్లస్వామి, వనపర్తి జిల్లా కోశాధికారి దేవని శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ గురై రైతు మృతి

**మల్దకల్ అక్టోబర్ 2 (జనంసాక్షి):** మండల పరిధిలోని మద్దెలబండ గ్రామానికి చెందిన రైతుబాపన్ భాయ్ వీరన్న(47)తన పోలముకు నీరు పెట్టాలని ట్రాన్స్ఫారం దగ్గరికి వెళ్లి కరెంటు వేయిచుండగా కరెంటు తగిలి అక్కడికక్కడే పడిపోగా ప్రక్క పొలం వారు అతను చూసి వెంటనే ఆటోలో ఎక్కించుకుని మద్దెలబండ గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో చనిపోగా మృతుడిని పోస్టుమార్టం నిమిత్తము గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతుని భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.



## గాంధీ ఆదర్శాలను భావితరాలకు అందించాలి: అదనపు కలెక్టర్ శ్రీను

**నారాయణపేట జిల్లా బ్యూరో, అక్టోబర్ 2(జనంసాక్షి):** మహాత్మా గాంధీ జీవన విధానం, ఆయన ఆచరించిన సత్యం, అహింస, సహనం మరియు నిరంతర కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని నారాయణపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను అన్నారు.



మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని, గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య ఉద్యమంలో ఎన్నో కష్టాలు, జైలు శిక్షలు ఎదురైనా గాంధీజీ ధర్మబద్ధమైన మార్గంలోనే పోరాటం సాగించారని గుర్తుచేశారు. నేటి యువత క్షుద్ర మార్గాలను ఆశ్రయించకుండా ఓర్పు, నిరంతర శ్రమతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. గాంధీజీ ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, కలెక్టరేట్ ఏఓ అనిల్ కుమార్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ముడుమాల్ అభివృద్ధికి కలెక్టర్ హామీ

**కృష్ణ, అక్టోబర్ 2 (జనంసాక్షి):**
నారాయణపేట జిల్లాలోని ప్రతిష్టాత్మక ముడుమాల్ బృహత్ శిలాయుగ (మెగాలిథిక్) చారిత్రక స్థల సమగ్ర అభివృద్ధి, పరిరక్షణ మరియు ప్రాచుర్యానికి జిల్లా యంత్రాంగం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక హామీ ఇచ్చారు.



శుక్రవారం తెలంగాణ వారసత్వ శాఖ సంచాలకులు ప్రొఫెసర్ అర్జున్ రావు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ ప్రొఫెసర్ మణికొండ వేదకుమార్ కలెక్టర్‌ను కలిసి ముడుమాల్ స్థల పరిరక్షణపై చర్చించారు.

**ప్రధాన ప్రతిపాదనలు - చర్చించిన అంశాలు:**

**1.సరిహద్దులు & భూసేకరణ:** ముడుమాల్ స్థల పరిరక్షణకు స్పష్టమైన సరిహద్దులను నిర్ధారించడం మరియు అవసరమైన భూసేకరణ చేపట్టుట.

**2.రవాణా సౌకర్యాలు:** పర్యాటకుల సౌకర్యార్థం స్థలానికి చేరుకునేలా బీటీ (BT) అప్రోచ్ రోడ్డును నిర్మించడం.

**3.అవగాహన & శిక్షణ:** ముడుమాల్ ప్రాశస్త్యాన్ని తెలియజేసేలా జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాహన సదస్సులు నిర్వహించడం. వారసత్వ పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి టూర్ గైడ్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం.

**4.సాంస్కృతిక ఉత్సవాలు:** ఈ చారిత్రక ప్రాంతానికి విశేష ప్రచారం కల్పించేందుకు ప్రతి సంవత్సరం ముడుమాల్‌లో రెండు ఉత్సవాలు నిర్వహించడం.

ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్, ముడుమాల్‌ను రాష్ట్రంలోనే కీలకమైన వారసత్వ పర్యాటక కేంద్రంగా (Heritage Tourism Hub) అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామని వెల్లడించారు.

## ఎమ్మెల్యే పర్ణికమ్మ హయాంలో విద్య, వైద్యానికి పెద్దపీట

**నారాయణపేట అక్టోబర్ 2(జనంసాక్షి):** నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలు అందిస్తూనే విద్య, వైద్యం, సాగునీరు మరియు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు.



ప్రభుత్వ పాఠశాలలకు నిధులు మంజూరు కావడంపై శుక్రవారం నారాయణపేట సీవీఆర్ భవన్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం, అధికార ప్రతినిధి వకీల్ సంతోష్ కుమార్, పట్టణ అధ్యక్షుడు వెంకటేష్ గౌడ్ పత్రికా సమావేశం నిర్వహించారు.

**పాఠశాలల అభివృద్ధికి రూ. కోట్ల నిధులు:**

**వాజీనగర్ హైస్కూల్:** వందేళ్ల చరిత్ర కలిగిన శివాజీనగర్ ప్రభుత్వ పాఠశాల ఇబ్బందులను అసెంబ్లీలో ప్రస్తావించి, రూ. 4.33 కోట్ల నిధులు మంజూరు చేయించారు. పళ్ల హనుమాన్ మందిరం వద్ద ఒక ఎకరం స్థలాన్ని కేటాయించి, నూతన భవనం మరియు క్రీడా మైదానం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

**ఇతర పాఠశాలలు:** కోటకొండ జడ్పీ హైస్కూల్‌కు రూ. 1.65 కోట్లు, ధన్వాడ హైస్కూల్‌కు రూ. 67.75 లక్షలు, దామరగిద్ద జడ్పీ హైస్కూల్, దామరగిద్ద తండా పాఠశాలలకు రూ. 13.55 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి.

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, సైన్స్ ల్యాబ్‌లు, అదనపు తరగతి గదుల కల్పనకు ప్రాధాన్యమిస్తోందని తెలిపారు.

నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే పర్ణికా రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు శ్వేత, రాజేశ్వరి, అరుణ, భాగ్యవతి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థులకు అల్పాహారం అందక ఇబ్బందులు

### గాంధీ జయంతి రోజునే ఆకలితో విద్యార్థుల అవస్థలు

**మద్దూరు, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మద్దూరు బాలికల గురుకుల పాఠశాలలో ఉదయం 10 గంటలు దాటినా అల్పాహారం అందక విద్యార్థులు ఆకలితో అలమటించారు. జీతాలు రాకపోవడం వల్లే టిఫిన్ తయారు చేయలేదని వంట సిబ్బంది తెలపగా, ప్రత్యామ్నాయంగా బిస్కెట్లు అందించామని ప్రిన్సిపల్ వివరణ ఇచ్చారు. సమాచారం అందుకున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు నరసింహ, సంగీత శివకుమార్, దినేష్ కుమార్ పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. గాంధీ జయంతి రోజునే



విద్యార్థులు ఆకలితో ఉండటం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీ నిర్లక్ష్యం, సిబ్బంది వేతన సమస్యలపై అధికారులు స్పందించి, భవిష్యత్తులో విద్యార్థుల ఆహారానికి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఓయూలో రోస్టర్ సవరణ సభను విజయవంతం చేయండి

- మాల ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ

**కృష్ణ, అక్టోబర్ 2 (జనంసాక్షి):** ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల (అక్టోబర్) 4న జరిగే 'చలో హైదరాబాద్' బహిరంగ సభను విజయవంతం చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణ మండలం హిందూపూర్‌లో మాల ఎడ్యుకేషన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ అనంతరం అమలు చేస్తున్న అశాస్త్రీయ రోస్టర్ విధానాన్ని తక్షణమే సవరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



**ప్రధాన అంశాలు & డిమాండ్లు...**

**రోస్టర్ నంబర్ 22పై అభ్యంతరం:** మాల మరియు దాని 28 ఉపకులాలకు రోస్టర్ నంబర్ 22ను కేటాయించడం ద్వారా విద్య, ఉద్యోగ అవకాశాలకు దూరం చేసే కుట్ర జరుగుతోందని సొసైటీ మండల అధ్యక్షుడు అనిల్ కుమార్ ఆరోపించారు.

**నోటిఫికేషన్లలో తీవ్ర అన్యాయం:** స్పష్టమైన విధివిధానాలు లేకపోవడం వల్ల ఉద్యోగ నోటిఫికేషన్లలో గ్రూప్-3 సామాజిక వర్గానికి (మాల, ఉపకులాలు) ఒక్క పోస్టు కూడా దక్కకుండా జీరో శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సంఘటిత పోరాటానికి పిలుపు:** ప్రభుత్వాల అన్యాయాలను తిప్పికొడుతూ తమ హక్కులు, రిజర్వేషన్ ఫలాలను సాధించుకోవడానికి మాలలందరూ సంఘటితంగా పోరాడాలని మండల ఉపాధ్యక్షుడు భీమేష్ కోరారు.

తక్షణమే రోస్టర్ విధానాన్ని సవరించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ నాయకులు అనిల్ కుమార్, భీమేష్, మహదేవ్, బసిలింగప్ప, అంజప్ప, అశోక్, సురేష్, మహేంద్ర, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## నాయిని జలాల్‌పూర్ గ్రామసభలో ఉద్రిక్తత

### పంచాయతీ నిధుల లెక్కలపై నిలదీసిన ప్రతిపక్షాలు





**కొల్చారం, అక్టోబర్ 02 (జనంసాక్షి):** మెదక్ జిల్లా కొల్చారం మండలం నాయిని జలాల్‌పూర్ గ్రామపంచాయతీలో గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్తత నెలకొంది. ఈ సభలో బీజేపీ జిల్లా నాయకుడు దాసు నరసింహులుకు కుర్చీ కేటాయించకపోవడంపై ఆయనకు అవమానం జరిగిందని గ్రామస్తులు ఆరోపించి ప్రశ్నించారు.

అలాగే పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనుల ఖర్చులపై ప్రతిపక్ష నాయకులు, ప్రజలు నిలదీయగా.. కార్యదర్శి, సర్పంచ్ సరైన సమాధానం చెప్పలేదని వాగ్వాదానికి దిగారు. నిధుల లెక్కలను పారదర్శకంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, గ్రామీణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా గాంధీ జయంతి

**అయిజ, అక్టోబర్ 02 (జనంసాక్షి):** అయిజ మున్సిపల్ కార్యాలయం, పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్ కౌన్సిలర్లతో కలిసి గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



ఆయన చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సాధారణ ఆస్పత్రిలో గాంధీ జయంతి

**నాగర్‌కర్నూల్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆర్ఎంఓ డాక్టర్ సి.నిఖిల్ రెడ్డి, డాక్టర్ నమిత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ప్రజాసేవ, ఆరోగ్య పరిరక్షణలో నిబద్ధతతో పనిచేయడమే గాంధీజీకి నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు రమ్యశ్రీ, నర్సింగ్ సూపరింటెండెంట్ సుమన్, హెడ్ నర్సులు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వెన్నచేడ్‌లో ఘనంగా గాంధీ జయంతి

**గండీడ్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** గండీడ్ మండలం వెన్నచేడ్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



అనంతరం సర్పంచ్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో గ్రామాభివృద్ధి, స్థానిక సమస్యలు, మౌలిక సదుపాయాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సుదీర్ఘంగా చర్చించారు. గ్రామాల సమగ్ర వికాసానికి ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని ఈ సందర్భంగా సర్పంచ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనంత లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, డైరెక్టర్ పుష్పలత, పులేందర్ రెడ్డి, ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మహిళా అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మహిళా రైతులకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం వనపర్తి మండలంలో ఎఫ్ పి ఓ (FPO) ద్వారా 103 మంది మహిళా రైతులకు 206 క్వింటాళ్ల ఉచిత వేరుశనగ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు.

**ఉచిత విత్తనాలతో పెట్టుబడి భారం తగ్గుదల...**

**ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..** వ్యవసాయంలో మహిళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. ఉచితంగా నాణ్యమైన విత్తనాలు అందించడం వల్ల మహిళా రైతులపై పెట్టుబడి భారం తగ్గి, మెరుగైన దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

**మహిళా సాధికారతకు పలు సంక్షేమ పథకాలు....**

మహిళల అభ్యున్నతి కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు:

1.వడ్డీ లేని రుణాలు, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ('మహాలక్ష్మి' పథకం).

2.మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్టీసీ బస్సుల నిర్వహణలో భాగస్వామ్యం.

3.ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వహణ, విద్యార్థుల దుస్తుల కుట్టుపని మహిళా సంఘాలకు అప్పగింత.

4.స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు మహిళలను చైర్‌పర్సన్లుగా నియమించడం.

మహిళలు కేవలం లబ్ధిదారులుగా కాకుండా వ్యాపార, వ్యవసాయ రంగాల్లో స్వయం సమృద్ధి సాధించి, కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవికిరణ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఇందిరా, ఏవో కురుమయ్య, అధికారులు మరియు మహిళా రైతులు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయం

- **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 2(జనంసాక్షి):** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య సాధన కోసం మహాత్మా గాంధీ అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి ప్రజలను ఏకతాటిపైకి తీసుకు వచ్చారని అన్నారు. సత్యం, అహింస, శాంతి, స్వచ్ఛత, గ్రామ స్వరాజ్యం వంటి మహాత్మా గాంధీ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ అభివృద్ధికి తమవంతు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కలెక్టరేట్ ఏఓ, సిబ్బంది తదితరులు పాల్గొని మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులర్పించారు.

# అక్రమ ఇసుక రవాణాపై కోహెడ పోలీసుల దాడి..

- **ఒక అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం సీజ్**




**కోహెడ, అక్టోబర్ 02 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా కోహెడ మండల పరిధిలోని వింజపల్లి మోయ తుమ్మెద వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనాన్ని (TS 36 TA 3516) స్వాధీనం చేసుకుని, వింజపల్లికి చెందిన నిందితుడు గీకురు శంకర్ (30)పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. రవాణాకు సంబంధించి ఎలాంటి అధికారిక పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించామన్నారు. మండలంలో అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జైలు శిక్ష కూడా తప్పదని ఎస్సై హెచ్చరించారు.

# విద్యుత్ తీగల చోరీల నిందితుడి అరెస్ట్



**న్యాల్‌కల్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** వ్యవసాయ బోరు బావుల వద్ద విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ నూనె చోరీలకు పాల్పడుతున్న వడ్డీ గ్రామానికి చెందిన జగన్నాథ్ అనే నిందితుడిని హద్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. రామతీర్థం, మిర్జాపూర్ (ఎన్) గ్రామాల శివారుల్లో చోరీలపై రైతుల ఫిర్యాదుతో ఎస్ఐ సుజిత్ కేసు నమోదు చేశారు. న్యాల్‌కల్ కూడలి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతని వద్ద నుంచి చోరీ చేసిన విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నారు.

# న్యాల్‌కల్‌లో నేడు శనగ విత్తనాల పంపిణీ

- **25 కేజీల బస్తాధర రూ:1500**
- **మండల ఏఓ అభినాష్ వర్మ**



**న్యాల్‌కల్, అక్టోబర్ 02 (జనంసాక్షి):** న్యాల్‌కల్ మండలంలో రబీ సీజన్ సందర్భంగా శనివారం ఉదయం 11 గంటలకు రైతు వేదిక వద్ద జిల్లా వ్యవసాయాధికారి చేతుల మీదుగా శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల ఏఓ అభినాష్ వర్మ తెలిపారు. 5 ఎకరాల్లోపు ఉన్న అర్హులైన రైతులకు భూ విస్తీర్ణం ఆధారంగా 25 కేజీల బస్తాను రాయితీ పోను రూ.1500కే అందజేస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వర్షాల వల్ల భూమిలో తేమ ఉన్నందున అవసరమైన మేర విత్తనాలు ఇవ్వాలని స్థానిక రైతులు కోరారు.

# ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు విద్యార్థుల ఎంపిక



**కొల్చారం, అక్టోబర్ 02 (జనంసాక్షి):** ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్ (జి) పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-19 క్యారమ్స్‌లో సంయుక్త, ఫుట్‌బాల్‌లో సింధు, జావెలిన్ త్రోలో ప్రియాంక, కబడ్డీలో హారిక అర్హత సాధించారు. ఎంపికైన క్రీడాకారులను ప్రిన్సిపాల్ వి.సంధ్యకుమారి అభినందిస్తూ, రాష్ట్రస్థాయిలోనూ రాణించి జాతీయస్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.

# బెల్టు జోరు.. మద్యం మాఫియా హవా!




**సిట్టింగ్ సెంటర్లు - పెరిగిన గొడవలు:** కొన్ని గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ సిట్టింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయడంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, శాంతిభద్రతల సమస్యలు, కుటుంబ కలహాలు పెరుగుతున్నాయి.

**పేద కుటుంబాలపై తీవ్ర ప్రభావం:** రోజువారీ కూలీలు కష్టపడి సంపాదించిన డబ్బును మద్యానికే తగలేస్తుండటంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. మద్యపాన రక్కసి కారణంగా ఇళ్లలో గొడవలు వద్ధి, అప్పుల భారంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

**ప్రజల డిమాండ్...**

ఎక్సైజ్ అధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. వైన్‌షాపుల నుంచి గ్రామాలకు సాగుతున్న అక్రమ మద్యం రవాణాను అడ్డుకుని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న బెల్టు షాపుల నిర్వాహకులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# దళిత జర్నలిస్టు ఫోరం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**మల్లకల్,అక్టోబర్ 2 (జనంసాక్షి):** సంగారెడ్డిలో అక్టోబర్ 7న జరిగే దళిత జర్నలిస్టు ఫోరం 11వ మహాసభల పోస్టర్లను మల్లకల్ మండలం బిజ్వారంలో సర్పంచ్ వై.శైలజ శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. తిరుమలేష్ విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల కృషి అభినందనీయమని, దళిత జర్నలిస్టులకు పూర్తి సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కర్రెన్న, కార్యదర్శి బసిరెడ్డి, ఏఈఓ పుష్ప, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో కల్లు ఫుల్

- **గాంధీ జయంతి రోజున జోరుగా కల్లు విక్రయాలు**



**బిజినేపల్లి, అక్టోబర్ 02 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల్లో, జనవాసాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహిస్తుండగా కల్లు విక్రయాలు ఫుల్లుగా జరుగుతున్నాయి. బిజినేపల్లి గ్రామంలోని రెండవ కల్లు దుకాణంలో కల్లు విక్రయాలు జోరుగా జరుగుతుండగా, మొదటి దుకాణంలో మాత్రం రహస్యంగా విక్రయాలు జరుగుతున్నాయి. గాంధీ జయంతి వేడుకల వేళ కల్లు, మద్యం, మాంసం, ఇతర మాదకద్రవ్యాల క్రయ విక్రయాలు నిలిపి వెయ్యాల్సి ఉండగా, మండల కేంద్రంలోనే జోరుగా కల్లు విక్రయాలు జరగడంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల పాత్ర ఉందా అని పలువురు అనుమానిస్తున్నారు. స్థానిక కల్లు వ్యాపారికి, ఎక్సైజ్ శాఖలో ఒక ఉన్నతాధికారికి సన్నిహిత సంబంధం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. అందువలననే మండల కేంద్రంలో ఫుల్లుగా కల్లు విక్రయం జరుగుతుందని పలువురు చర్చించుకుంటున్నారు

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**అమీన్పూర్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** గుర్తుతెలియని మృతదేహం లభించిన సంఘటన అమీన్పూర్ పోలీస్ పరిధిలో చోటుచేసుకుంది. అమీన్పూర్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... అమీన్పూర్ పెద్ద చెరువు కట్ట వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం రావడంతో వెళ్లి చూడగా 25 నుండి 40 సంవత్సరాల వయసు గల మగ వ్యక్తి మృతదేహం పడి ఉంది. మృతదేహాన్ని పటాన్చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి మించిన వారు ఎవరైనా ఉంటే అమీన్పూర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు.

# నారాయణపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి: సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా

- **ఎకరాకు రూ. 25,000 నష్టపరిహారం ఇవ్వాలి**
- **పత్తి క్వింటాలుకు రూ. 10,000 మద్దతు ధర చెల్లించాలి**



**నారాయణపేట, అక్టోబర్ 2 (జనంసాక్షి):** ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నందున నారాయణపేటను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించాలని సామాజిక కార్యకర్త హెచ్. నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బిజ్వార్, పులిమామిడి, ఎర్రగట్‌పల్లి పొలిమెర్ల పంట పొలాల మధ్య రైతులతో కలిసి ఆయన ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు 'విజ్ఞప్తి దీక్ష' చేపట్టారు.

**ప్రధాన డిమాండ్లు...**

**నష్టపరిహారం:** వర్షాభావ పరిస్థితుల వల్ల తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు rs25,000 నష్టపరిహారం చెల్లించాలి.

**మద్దతు ధర & కొనుగోలు:** పత్తి క్వింటాలుకు rs10,000 మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేయాలి.

**కరువు ప్యాకేజీ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రత్యేక కరువు ప్యాకేజీని ప్రకటించి ఆపదలో ఉన్న రైతులకు చేయూతనివ్వాలి.

**రుణాల రీషెడ్యూల్:** రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న అన్ని రకాల పంట రుణాలను తక్షణమే రీషెడ్యూల్ చేయాలి.

రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వాలు త్వరితగతిన స్పందించాలని ఆయన కోరారు. ఈ నిరసన దీక్షలో రైతులు తాయప్ప, రమేష్, సప్పటి చిన్న నర్సింహా, విద్యావంతులు దోరోళ్ల కృష్ణయ్య, వి. శివకుమార్ తదితరులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.

# జర్నలిస్టుల రక్షణకు మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

- **జర్నలిస్టుల ప్రతి జర్నలిస్టుకూ హెల్త్ కార్డు.. ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి**
- **గాంధీచౌక్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిరసన**

**వనపర్తి బ్యూరో, అక్టోబర్ 2 (జనంసాక్షి):** రక్షణ, హక్కులు మరియు సంక్షేమం కోసం నూతన మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్ డిమాండ్ చేశారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం వనపర్తి గాంధీచౌక్‌లో జిల్లా అధ్యక్షుడు డి.మాధవరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

**ప్రధాన డిమాండ్లు:**

**1.మీడియా కమిషన్ & రక్షణ చట్టం:** ప్రెస్ కౌన్సిల్ స్థానంలో సమగ్ర అధికారాలతో మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి. విధి నిర్వహణలో దాడులు, వేధింపులు అరికట్టేలా ప్రత్యేక రక్షణ చట్టం తేవాలి.

**2.క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు:** అక్రిడిటేషన్ కార్డులను హెల్త్ కార్డులతో అనుసంధానించి, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉచిత, క్యాష్‌లెస్ వైద్య సేవలు అందించాలి.

**3.ఇళ్ల స్థలాలు & నూతన వేజ్‌బోర్డు:** గ్రామీణ, పట్టణ స్థాయి జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి. వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం కొత్త వేజ్‌బోర్డును పునరుద్ధరించాలి.

ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి, ఆర్డీవో సుబ్రహ్మణ్యానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి బి.రాజు, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు ఆంజనేయులు సాగర్, పట్టణ అధ్యక్షుడు తైలం అరుణ్‌రాజ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు, వివిధ మండలాల నాయకులు మరియు సుమారు 200 మంది జర్నలిస్టులు పాల్గొన్నారు.








# జోగులాంబ గద్వాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి: బీజేపీ డిమాండ్

**అయిజ, అక్టోబర్ 02 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లాను తక్షణమే కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీజేపీ అయిజ మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.రామచంద్రరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం అయిజ మండలంలోని ఎక్లాస్‌పురం, దేవబండ, బింగిదొడ్డి గ్రామాల్లో ఎండిపోయిన పంట పొలాలను నాయకులు పరిశీలించారు.

**ప్రధాన డిమాండ్లు & ఆరోపణలు:**

**అత్యల్ప వర్షపాతం:** ఐఎండీ (IMD) గణాంకాల ప్రకారం గత నాలుగు నెలలుగా జిల్లాలో 41.3% లోటు వర్షపాతం నమోదైందని, రాష్ట్రంలోనే ఇది అత్యంత తీవ్రమైన కరువు పరిస్థితులకు దారి తీసిందని తెలిపారు.

**పంట నష్టం:** వర్షాధార పంటలు పూర్తిగా ఎండిపోగా, పత్తి పంట ఎకరాకు 20 కేజీలు కూడా వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**పరిహారం & పథకాలు:** రైతులకు తక్షణమే పూర్తి స్థాయి రుణమాఫీ వర్తింపజేయాలని, ఇన్పుట్ సబ్సిడీ అందించాలని, డ్రిప్ మరియు స్ప్రింక్లర్లను 100% సబ్సిడీతో ఇవ్వాలని కోరారు.



**ఫసల్ బీమా & ఆర్డీఎస్ నీళ్లు:** రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వెంటనే అమలు చేయాలని, రైతు బీమా ప్రీమియం చెల్లించాలని డిమాండ్ చేశారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి ఆర్డీఎస్ (RDS) ద్వారా పంట చేతికి వచ్చే వరకు నీటిని విడుదల చేయించాలని కోరారు. రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ అధ్యక్షుడు తెలుగు నరసింహ, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్, నాయకులు లక్ష్మన్న, ప్రదీప్ శెట్టి, శ్రీకాంత్ ముదిరాజ్, తిమ్మారెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం: బీజేపీ నాయకులు

**మక్తల్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ (SIR) కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. మక్తల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఎస్ఐఆర్ ద్వారా మరణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లతో పాటు దొంగ ఓట్లను తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అనుకూల దొంగఓట్లు పోతాయనే భయంతోనే ఆ పార్టీ నాయకులు అల్లర్లు సృష్టిస్తూ, నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. నోరు తెరిస్తే ఓటు చోరీ అనే రాహుల్ గాంధీ తమ కుటుంబ చరిత్రను గుర్తుతెచ్చుకోవాలని, నాడు పటేల్‌కు ఎక్కువ ఓట్లు వచ్చినా నెహ్రూను ప్రధానిని చేయడమే అసలైన ఓటు చోరీ అని ఎద్దేవా చేశారు.

ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. బలరాం రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు వెంకట్రాములు, మండల అధ్యక్షుడు ఎం. ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.



# రూ. 3.50 కోట్లతో నూతన బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభం

- **మక్తల్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది: వాకిటి శేషగిరి**

**మక్తల్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మక్తల్ మండలంలోని రుద్రసముద్రం గ్రామానికి సమీపంలో రూ. 3 కోట్ల 50 లక్షల నిధులతో చేపట్టనున్న నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి సోదరులు, మాజీ ఉపసర్పంచ్ శ్రీ వాకిటి శేషగిరి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాకిటి శేషగిరి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి, తమ ప్రియతమ నాయకులు వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో మక్తల్ నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ అభివృద్ధిలో దూసుకుపోతోందని అన్నారు. రుద్రసముద్రం సమీపంలో రూ.3.50 కోట్లతో నిర్మించ తలపెట్టిన ఈ నూతన బ్రిడ్జి పనులే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజల రవాణా ఇబ్బందులు పూర్తిగా తొలగిపోతాయని, ప్రయాణం మరింత సులువవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింగప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్ట సురేష్ కుమార్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఇసుక లేకుండానే బ్రిడ్జి నిర్మాణ పనులు

- **నాణ్యతపై టీఆర్ఎస్ కౌన్సిలర్ల ఆందోళన**

**మద్దూరు, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మద్దూరు పట్టణంలో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనుల్లో నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా అనే అంశంపై టీఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు బర్ల శివకుమార్, కల్లపు దినేష్, నరసింహ, మౌలానా ఆందోళన వ్యక్తం చేశారు. ఇసుక లేకుండానే బూస, కంకర, సిమెంట్ కలిపి నిర్మాణ పనులు ప్రారంభించారని వారు ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ టీఆర్ఎస్ కౌన్సిలర్లు నిర్మాణ ప్రదేశానికి వెళ్లి పరిశీలించారు. అయితే అక్కడ పనులకు సంబంధించిన డీఈ, ఏఈ, సంబంధిత ఇంజనీర్, కాంట్రాక్టర్ ఎవరూ లేకపోవడం గమనార్హమని వారు పేర్కొన్నారు. వారి పర్యవేక్షణ లేకుండానే మేస్త్రీలు, కార్మికులతో పనులు కొనసాగించడం పట్ల కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో ఇంత నిర్లక్ష్యం తగదని, నిర్మాణ నాణ్యత విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పనులను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తూ నిబంధనల ప్రకారం నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



# జర్నలిస్టులకు క్యాష్‌లెస్ హెల్త్ కార్డులు ఇవ్వాల్సిందే: సీఎంకు పోస్టుకార్డులు

**నారాయణపేట జిల్లా బ్యూరో ఆక్టోబర్ 2 (జనంసాక్షి):** అత్యవసర సమయంలో జర్నలిస్టులకు వైద్య ఖర్చుల భారం తగ్గించేలా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఉచిత, క్యాష్‌లేస్ వైద్య హెల్త్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లాలో జర్నలిస్టులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. టియుడబ్ల్యూజే (TUWJ) రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ పిలుపు మేరకు శుక్రవారం మున్సిపల్ పార్కు నుంచి గాంధీజీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

అనంతరం పోస్టాఫీస్ కేంద్రానికి చేరుకుని సీఎం రేవంత్ రెడ్డికి తమ డిమాండ్లతో కూడిన పోస్టుకార్డులను పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టుల ఆరోగ్యం వారిపై ఆధారపడిన కుటుంబాలకు కొండంత భరోసా అని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో పరిమితి లేని ఉచిత వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయపరమైన సంక్షేమానికి ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జర్నలిస్టులు అంబదాస్, నారాయణ, అల్వాల్ రమేష్, ప్రతాప్‌రెడ్డి, మహ్మద్ రఫీ, బ్రహ్మానందరాజు తదితరులు పాల్గొన్నారు.



# కడ్వల్ లో విబిజిఆర్ఎంజి ఫారం ఫండ్ పనులను పరిశీలించిన అధికారులు

**సిర్గాపూర్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్వల్ గ్రామంలో ఉపాధి హామీ (VBGRMG) కింద జరుగుతున్న ఫారం ఫండ్ పనులను సెంట్రల్ టీం గురువారం సందర్శించి పరిశీలించారు. రైతు జంపల శాంతమ్మ,లక్ష్మయ్య, పొలంలోని జరుగుతున్న పనులను పరిశీలించారు. బృందం ప్రతినిధులు పనుల వద్ద కూలీలతో మాట్లాడారు. వేతనాలు సదుపాయాలు సమస్యల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ శ్రీలక్ష్మి, అడిషనల్ డిఆర్డిఓ బాలరాజ్, ఎపిడి విజయలక్ష్మి, ఎంపీడీవో అండలమ్మ, ఏపీఓ నర్సింలు, ఈసీ గణపతి, టీఏ కృష్ణ,ఎంపీఓ బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి ,సర్పంచ్ విమల విట్టల్ రెడ్డి, ఎఫ్ఎ వెంకట్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# గ్రామ అభివృద్ధే ప్రథమ ధ్యేయం: సర్పంచ్ పద్మమ్మ

**ఖిల్లా ఘనపురం,02, అక్టోబర్ (జనంసాక్షి):** ఖిల్లా ఘనపురం గ్రామ పంచాయతీ భవనంలో సర్పంచ్ ఆగారం పద్మమ్మ, కార్యదర్శి రవి కుమార్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు, గ్రామసభ నిర్వహించారు. గాంధీజీకి నివాళులర్పించిన అనంతరం, వీబీజీ రామ్‌జీ, మిషన్ భగీరథ, స్వచ్ఛతా అంశాలపై చర్చించారు. తాగునీటిని పొదుపుగా వాడాలని, గ్రామ అభివృద్ధిలో ప్రజలంతా భాగస్వాములు కావాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ క్యామ నవనీత, నాయకులు ప్రకాష్, రాళ్ల కృష్ణయ్య, ఉపసర్పంచ్ మంజుల, వార్డు సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**మిడ్జిల్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** మిడ్జిల్‌లో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సత్యం, అహింస, గ్రామ స్వరాజ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



**మహబూబ్‌నగర్ అర్బన్ అక్టోబర్ 02(జనంసాక్షి):** మహబూబ్‌నగర్‌లో డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్ ఆధ్వర్యంలో గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం, ఆయన చూపిన సత్యం, అహింస, రాజ్యాంగ బద్ధమైన మార్గంలో నడుస్తూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ మమత, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



**గుండుమాల్, అక్టోబర్ 2 (జనంసాక్షి):** గుండుమాల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, గ్రామపంచాయతీ తదితర చోట్ల గాంధీజీ 157వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. సర్పంచ్ శ్రీశైలమ్మ గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన చూపిన అహింసా మార్గాన్ని, త్యాగాలను స్మరించుకుంటూ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి

### నీటి సంరక్షణ, పారిశుధ్యం, ఉపాధి హామీపై అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో అక్టోబర్ 2 (జనంసాక్షి):** ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలో సర్పంచ్ సంగీత అధ్యక్షతన వికసిత్ గ్రామ పంచాయతీ ప్లాన్ (వీబీజీ రామ్ జీ) ప్రత్యేక గ్రామసభను శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, గ్రామంలోని సోషల్ మ్యాప్, వనరుల చిత్రపటాన్ని ఆమె పరిశీలించారు.

**గ్రామసభలో కలెక్టర్ వెల్లడించిన కీలక అంశాలు:**

**ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి:** ఏళ్ల తరబడి ఒకే తరహా పనులు చేయకుండా, గ్రామ వనరులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలి.

**నీటి సంరక్షణ & పరిశుభ్రత:** వర్షపు నీటిని సంరక్షించడం, నీటిని పొదుపుగా వాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. తడి, పొడి చెత్తను వేరు చేస్తూ పరిసరా పరిశుభ్రతను ఇళ్ల నుంచే ప్రారంభించాలి.

**ఉపాధి హామీ పథకాలు:** వీబీజీ రామ్ జీ, ఉపాధి హామీ పథకాల కింద చేపట్టే పనుల వివరాలు ప్రతి కుటుంబానికి తెలిసేలా అవగాహన కల్పించాలి. నీటి నిల్వ, రహదారులు, భవనాల నిర్మాణంతో పాటు కూలీలకు ఉపాధి కల్పించాలి.

**బాల్య వివాహాల నిర్మూలన:** 18 ఏళ్లు నిండని బాలికలకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, ప్రతి పంచాయతీని బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

పాఠశాల నిర్వహణ, విద్యా ఫలితాల్లో ముందంజలో



ఉన్న జాజాపూర్ గ్రామాన్ని కలెక్టర్ అభినందించారు. అనంతరం నీటి సంరక్షణ, స్వచ్ఛత, బాల్య వివాహాల నివారణపై సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించి, జాజాపూర్‌ను 'బాల్య వివాహ రహిత గ్రామం'గా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్ కుమార్, డీఆర్‌డీఓ వెంకట్ రాములు, డీడబ్ల్యూఓ రాజేందర్ గౌడ్, జిల్లా నోడల్ అధికారి యాదయ్య, ఎంపీఓ బాలాజీ, కార్యదర్శి వేణుగోపాల్, ఉప సర్పంచ్ లక్ష్మణ్, వార్డు సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాగ్రత్త... ఒక్క క్లిక్‌తో ఖాతా ఖాళీ

**మోసాల రకాలు - కేటుగాళ్ల ఎత్తుగడలు**

కేటుగాళ్లు ముఖ్యంగా నాలుగు మార్గాల్లో మోసగిస్తున్నారు. బ్యాంకు కేవైసీ లేదా ఉచిత రీఛార్జ్ పేరిట వాట్సాప్, ఎస్ఎంఎస్‌లలో ఫిషింగ్ లింకులు పంపి ఫోన్ హ్యాక్ చేస్తున్నారు. డ్రగ్స్ పార్సిల్ వచ్చిందంటూ సీబీఐ, ముంబై పోలీసుల పేరుతో వీడియో కాల్స్ చేసి డిజిటల్ అరెస్ట్ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పార్ట్ టైమ్ జాబ్స్, లైక్స్ కొడితే డబ్బులంటూ టెలిగ్రామ్ గ్రూపుల్లో చేర్చి, మొదట కొంత లాభం చూపి ఆపై లక్షల్లో పెట్టుబడులు పెట్టించి ముంచుతున్నారు. క్రెడిట్ కార్డ్ లిమిట్ పెంచుతామని నమ్మించి ఓటీపీ సేకరించి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు.

**సైబర్ మోసాల రక్షణోపాయాలు**

అనుమానాస్పద లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. బ్యాంక్ ఖాతా సంఖ్య, పిన్, సీవీవీ, ఓటీపీ వివరాలను ఎవరికీ చెప్పవద్దు. ఏ బ్యాంక్ అధికారీ ఫోన్లలో ఓటీపీలు అడగరని గుర్తుంచుకోవాలి. పోలీసులు, ప్రభుత్వ అధికారులు వాట్సాప్ లేదా స్కైప్ వీడియో కాల్స్ ద్వారా విచారణలు చేయరు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే కట్ చేయాలి. అధికారిక ప్లే స్టోర్, యాప్ స్టోర్ల నుండి మాత్రమే యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవాలి. స్క్రీన్ షేరింగ్ యాప్‌లను అపరిచితులు చెప్పినట్లు ఇన్స్టాల్ చేయవద్దు.

**బాధితులు చేయాల్సిన చర్యలు**

మోసానికి గురైతే మొదటి 24 గంటలలోపే స్పందించాలి. తక్షణమే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే, డబ్బులు వేరే ఖాతాలకు వెళ్లకుండా బ్యాంకులు హోల్డ్‌లో పెడతాయి. లేదా ఒఒఒ.ఎఎఎవతీఎతీఅఎవ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో గానీ, స్థానిక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో గానీ ఫిర్యాదు చేయవచ్చు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: జడ్చర్ల పట్టణ సీఐ కమలాకర్

సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త రకాల పద్ధతులతో అమాయకులను మోసం చేసేందుకు యత్నిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీ, బ్యాంక్ వివరాలు లేదా సీవీవీ వంటి గోప్యమైన సమాచారాన్ని అందించవద్దు. పోలీసుల పేరుతో వచ్చే అనుమానాస్పద వీడియో కాల్స్ లేదా మెసేజ్ లింకులను చూసి భయాందోళనకు గురికావద్దు.

ఏ ప్రభుత్వ అధికారీ వాట్సాప్ లేదా స్కైప్ కాల్స్ ద్వారా విచారణ చేయరు. ఎవరైనా మోసపోతే తక్షణమే 1930 కి సమాచారం ఇవ్వాలి లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలి. ప్రతి ఒక్కరి అప్రమత్తతే సైబర్ నేరాలకు ఏకైక అడ్డుకట్ట అని తెలిపారు.

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు


వనపర్తి లో


జకినాలపల్లిలో


అమరవాయిలో


రేవల్లి లో


నాగర్ దొడ్డి లో


గద్వాల లో


నారాయణపేట లో


గండీడ్ లో


గుంజేట్టి లో


మామిడిగి లో


శివ్వంపేట లో


బొడ్మట్‌పల్లి లో


బెజ్జంకి లో


బెజ్జంకి లో


నంగునూరు లో


కోహెడ లో


కోహెడ లో


గుమ్మడిదల లో


సదాశివపేట లో